క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు




హోమంలో పాల్గొన్న భక్తులు

ఆస్పరి: మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో వాల్మీకి మహర్షి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు రెండవ రోజు ఆదివారం కొనసాగాయి. పురోహితులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో పంచకళశ, నవగ్రహ, అష్టదిక్పాలక, నవదుర్గ, మత్యుంజయ, ఏకాదశ రుద్ర పూజలు చేపట్టారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి అభిషేకం, ధాన్యాధివాసం, నవగ్రహ, రుద్ర, సుదర్శన హోమం జరిపించారు.

దేవరగట్టులో విశేష పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి దర్శనం కోసం స్థానికులతో పాటు కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పూజారులుఎ మాళ మల్లేశ్వర స్వామి మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాత సేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేపట్టారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



కడమకుంట్ల సమీపంలో ప్రతిష్ఠించిన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం

తుగ్గలి: మండలంలోని కడమకుంట్ల–రోళ్లపాడు గ్రామాల మధ్యనున్న కదిరప్పస్వామి కొండలో వెలసిన ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో వేద మంత్రోచ్ఛారణలతో పురోహితులు స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పత్తికొండ రూరల్ : ప్రభుత్వ వైద్య కళాశాలలను కార్పొరేట్ చేతికి అప్పగించి ప్రైవేటీకరణ చేసే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్రాంతినాయుడు పేర్కొన్నారు. ఏపీలో వైద్య విద్యను పబ్లిక్–ప్రైవేట్–పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లోకి తెచ్చే విధాన పరమైన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సారా తయారీపై ఉక్కుపాదం

తుగ్గలి : సారా తయారీ, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ సాయిప్రవీణ్ హెచ్చరించారు. సారా నిర్మూలనలో భాగంగా ఆదివారం ముక్కెల్ల, మారెల్లలో అవగాహన సదస్సులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం చేపట్టిందన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం

వెల్దుర్తి: పట్టణంలోని డోన్ రోడ్డులో హోండా షోరూం వద్ద డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీపీఓ భాస్కర్ తెలిపారు. ఆదివారం డీఎల్‌పీఓ లక్ష్మితో కలిసి డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. షోరూం వైపు నుంచి కొత్తబస్టాండు మీదుగా పోలీస్‌స్టేషన్ దాటే వరకు డ్రైనేజీ కాలువ నిర్మాణ అవసరాన్ని గుర్తించారు. రూ.50 లక్షలకు మించి ఖర్చయ్యే కాలువ నిర్మాణానికి జిల్లా కలెక్టరుకు నివేదిస్తామని చెప్పారు. అనుమతులు మంజూరైన వెంటనే టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఈఓఆర్డీ రవికిశోర్, స్థానిక పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

యువత పోరుకు తరలిరండి

ఆలూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈనెల 12వ తేదీన కర్నూలులో నిర్వహించే యువత పోరుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు తరలిరావాలని ఆ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె సాక్షితో మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు.

బారే చెన్నాకే కేతుమే



తండావాసుల వేషధారణలో యువకులు

హొళగుంద: స్థానిక విరక్త మఠం పరిసర ప్రాంతాలకు చెందిన వీరశైవ లింగాయత్, ఇతర ప్రాంతాల యువకులు ఆదివారం తండావాసుల వేషధారణలో చెన్నాకే కేతుమే అనే హాస్య నృత్యం, పాటలతో అలరించారు. గ్రామంలో జరుగుతున్న కామన్న వేడుకల్లో భాగంగా ఆదివారం యువకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

పాత భవనమే ముద్దు!

- నిరుపయోగంగా నూతన భవనాలు
- లక్షలాది రూపాయలతో నూతన గ్రామ సచివాలయాల నిర్మాణం
- చిప్పగిరి, నగరడోణలో వినియోగానికి నోచుకోని గ్రామ సచివాలయాలు
- తిమ్మాపురంలో పదేళ్లయినా వినియోగించని అంగన్‌వాడీ భవనం
- అసౌకర్యంగా ఉన్నా పాత భవనాల్లోనే విధులు
- వృథా అవుతున్న ప్రజా ధనం



తిమ్మాపురంలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనం



తిమ్మాపురంలో అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం

చిప్పగిరి: లక్షల రూపాయలు ప్రజాధనం వెచ్చించి మండలంలో నూతనంగా నిర్మించిన పలు గ్రామ సచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు వినియోగానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. కొత్త భవనాలు అందుబాటులో ఉన్నా పాత వాటిలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా నూతన భవనాల్లో అన్ని రకాల వసతులు ఉంటాయి. దీంతో వాటిల్లో విధులు నిర్వహించేందుకు సిబ్బంది సుముఖంగా ఉంటారు. అయితే మండలంలోని అధికారులు, సిబ్బంది తీరు ఇందుకు భిన్నంగా ఉంది. మండలంలోని 16 గ్రామాలకు రూ.3.60 కోట్లు మంజూరు చేసి మండల కేంద్రంతో పాటు ఏరూరు, డేగులహాలు, గుమ్మనూరు, దౌల్తాపురం, బెల్దోణ, నగరడోణ, రామదుర్గం, నేమకల్లు, గ్రామాల్లో ఒక్కో భవనానికి సుమారు రూ.40 లక్షలు వెచ్చించి సచివాలయాల భవనాలు నిర్మించింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఇందులో 5 భవనాలు నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సం కూడా పూర్తి చేసుకున్నాయి. వీటిలో నేమకల్లు,దౌల్తాపురం,ఏరూరు భవనాలు వినియోగంలో ఉన్నాయి. మిగిలి న నగరడోణ ,చిప్పగి రిలో నూతన భవనా లు వినియోగానికి నోచుకోకపోవడంతో భవనాల చుట్టూ ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం రాకతో రామదుర్గం,డేగులహాలు, బెల్దోణ,గుమ్మనూరు తదితర గ్రామల్లో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. కొత్త భవనాలు లేక కొన్ని శాఖల సిబ్బంది ఆవేదన పడుతుంటే.. కొత్త భవనాలు ఉండి కూడా వినియోగించుకోక పోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వినియోగానికి నోచుకోక శిథిలావస్థకు..

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం 10 సంవత్సరాలైనా వినియొగానికి నోచుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. భవనం లోపల బండలు కుంగిపోయాయి. అలాగే వెలుపల గోడలు సైతం బీటలు వారాయి. భవనం ఉన్నా గ్రామంలో అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించడంపై పిల్లల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



చిప్పగిరిలో నిరుపయోగంగా ఉన్న నూతన గ్రామ సచివాలయ భవనం

> **విచారించి చర్యలు తీసుకుంటాం**
>
> చిప్పగిరి, నగరడోణ గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన నూతన గ్రామ సచివాలయాలు, తిమ్మాపురంలో నూతన అంగన్‌వాడీ భవనం ఎందుకు వినియోగించుకోవడం లేదో విచారించి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.
>
> – అల్లాబకాష్, ఎంపీడీఓ



విద్యార్థులను మోసం చేస్తున్న ప్రభుత్వం



పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దికెర : అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీ రీయింబర్స్‌మెంట్ నిధులు, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా పట్టించకోక విద్యార్థులను, యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంపీపీ అనిత గృహంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన కర్నూలులో చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోస్టర్లు విడుదల చేశారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫీ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇంటికి పంపుతున్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వసతిదీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఫీజులు చెల్లించక పోవడంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ ప్రయత్నాలు చేస్తుండడంతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే అవకాశముందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగేష్, ఎంపీపీ అనిత, మండల కన్వీనర్ మల్లికార్జున, వైస్ ఎంపీపీ మహేష్ రెడ్డి, నాయకులు బండారి అంజనేయులు, మాజీ శ్రీనివాసులు,రేవప్ప,చంద్ర,కిట్టి, బాలచంద్ర పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతి (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థుల 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులయితే 2011 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్యన జన్మించిన వారు అర్హులన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు, ఓసీ, బీసీలైతే రూ.150 చెల్లించి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 20న ఇదే పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, కనీసం 35 మార్కులు సాధించిన, మెరిట్ లిస్ట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్ట్, ఆదే రోజు ఎంపిక జాబితాను వెల్లడిస్తామన్నారు. ఎంపికైన వారికి 30న సర్టిఫికెట్ల పరిశీలన తోపాటు కౌన్సెలింగ్ నిర్వహించి సీటు కేటాయిస్తామన్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి తరగతులు ప్రారంభిమిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ఆదివారం కర్నూలు సత్యసాయిసేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. శిబిరంలో వైద్యులు రవిబాబు, శృతి, చంద్రశేఖర్, అనిల్‌కుమార్, మల్లేశ్వరి, నాగరాజు ప్రజలకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, కీళ్ల నొప్పులు, గుండె, తదితర జబ్బులకు చికిత్సలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ మొత్తం 415 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ అభ్యర్థన మేరకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, సీఐ వంశీనాథ్, ఏఓ అక్బర్‌బాషా, సత్యసాయిసేవా సంస్థ సభ్యులు అశోక్, రామ్మోహన్ పాల్గొన్నారు.

వేడుకగా తిమ్మన్న తాత ఉరుసు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు మజరా గ్రామమైన కలపరిలో ఆదివారం తిమ్మన్న తాత ఉరుసు వేడుకగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా తిమ్మన్న తాత దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి తాత గుర్రాన్ని మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. తాత గుర్రానికి భక్తులు బిందెలతో నీళ్లు పోసి పూజించారు. సోమవారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయద్‌తాత, వెంకటేష్, ఓబులేసు, వీరభద్రి, శ్రీనివాసులు, రమేష్, బలరాముడు, ఎర్రమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



హలిగేరిలో పూజలందుకున్న నారాయణ తాత

ఆస్పరి: మండలంలోని హలిగేరిలో వెలసిన నారాయణ తాత 36వ ఆరాధనోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో నారాయణ తాత సమాధికి పాలాభిషేకం, ఆలయం ఎదుట నూతనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల జయజయధ్వానాల మధ్య నారాయణతాత ప్రభోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు అన్నదానం చేశారు.



కంబాలపాడు బీసీ హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

అలంకార ప్రాయంగా..

హాస్టళ్లలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

కృష్ణగిరి: హాస్టళ్లలో ఉండే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరూపయోగంగా మారాయి. మండలంలోని కంబాలపాడు గ్రామంలోని బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్లలో 2023లో కేంద్ర ప్రభుత్వ నిధులతో స్వచ్ఛభారత్ కింద దాదాపు 64 మరుగుదొడ్లు నిర్మించారు. అయితే ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే వాటిని వాడటం మానేశారు. మరుగుదొడ్లు నిర్మించే సమయంలో సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేయకుండా రింగ్‌లు వేయడంతో వాటిల్లో నీరు నిండుతుండటంతో వాడకం మానేశారు. ఇక్కడి భూమి బంకతో కూడుకున్నది కావడంతో నీరు ఇంకి పోకపోవడంతో నిరూపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి వీటికి సెప్టిక్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొస్తే విద్యార్థులకు ఉపయోగపడుతాయి.

యువతకు అండగా వైఎస్సార్ సీపీ

- ఈ నెల 12న కర్నూలులో వైఎస్సార్ సీపీ యువత పోరు
- భారీగా తరలిరండి
- ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి



ఆలూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమెల్యే విరూపాక్షి, నాయకులు

ఆలూరు రూరల్: నిరుదోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం అమలు చేయకపోవడం , కూటమి ప్రభుత్వ చర్యలు నిరసిస్తూ యువతకు అండగా వైఎస్సార్‌సీపీ యువత పోరు పేరిట ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే విరూపాక్షి తెలిపారు. స్థానిక అర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తాలూకా అధ్యక్షుడు దానాల రాజు ఆధ్వర్యంలో పోరుబాట పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు యువత పోరు ఆందోళన కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ నెల 12న కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించామన్నారు. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్సార్‌సీపీ పాలనలో మరింత మెరుగుపరిచి అమలు చేశారని, నేడు ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఆపేసిందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్ ఇస్తాయో, ఇవ్వవో తెలియని పరిస్థితి నెలకొందని, అలాగే కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామని, లేకుంటే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన నేతలు ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. అలాగే ప్రతి ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పి నెరవేర్చలేదన్నారు. యువత పోరు కార్యక్రమానికి నియోజకవర్గంలోని విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల తాలుకా, మండల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లికార్జున, కో–కన్వీనర్ వీరేష్ నాయకులు వెంకటేశులు, రాంగోపాల్, గుండయ్య, హనుమంతప్ప, భాస్కర్, శివన్న, జాన్, శేఖర్, బాబు,రాముడు పాల్గొన్నారు.



కమ్మరచేడులో మంగమాంబ రథోత్సవం

రమణీయం.. రథోత్సవం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు,కరిడిగుడ్డం గ్రామాల్లో కొలువుదీరిన అవధూత శ్రీ మంగమాంబ రథోత్సవం ఆదివారం సాయంత్రం రమణీయంగా నిర్వహించారు. కమ్మరచేడులో ఉదయం మంగమాంబకు ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగమాంబ ఉత్సవమూర్తిని తేరులో ఉంచి ఆలయం నుంచి ఎదురు బసవన్న దేవాలయం వరకు లాగారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అలాగే..కరిడిగుడ్డంలో ఆలయం నుంచి బసన్న గుడివరకు రథాన్ని లాగారు. ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలూరు సీఐ వెంకటచలపతి, ఎస్ఐ దిలిప్‌కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కరిడిగుడ్డంలో మంగమాంబ రథోత్సవం

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కె.వి నారాయణ

ఆస్పరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెౌర్పవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా పింఛన్లు పెంపు తప్ప చేసిందేమీ లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. అన్ని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించి వలసలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు మండలంలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించునున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 18న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేపట్టునున్నట్లు చెప్పారు. సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు మల్లేష్, రంగస్వామి, ఈరన్న, వీర భద్రి, రవి పాల్గొన్నారు.



పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కలిసిన మిత్రులు.. కదలాడిన జ్ఞాపకాలు

- 35 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

తుగ్గలి : విద్యార్థి దశలో చేసిన అల్లరి..ఆటలు.. పాటలు..చిలిపి పనులు గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1991–92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆదివారం పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. 35 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆనందంలో అంతా ఉద్వేగ్గానికి లోనయ్యారు. ఒకరినొకరు గుర్తు పట్టేందుకు చేసే ప్రయత్నం..నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ మరోమారు విద్యార్థులుగా మారిపోయారు. సెల్ ఫోన్ జీవితాన్ని పక్కనబెట్టి రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులు హుసేన్, గోపాలకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీఐ లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచ్ గౌరవ సలహాదారుడు పాటిల్ సుధాకరరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా నెణికిలింగేశ్వర పట్టద దేవర

- సామూహిక వివాహాల్లో ఒక్కటైన 16 జంటలు

హొళగుంద: మండలంలోని నెరణికి గ్రామంలో ఆదివారం నెణికి లింగేశ్వరస్వామి పట్టా దేవర (పట్టాభిషేక) ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామంలో వెలిసిన నెణికిలింగేశ్వర, భీరలింగేశ్వర స్వామితో కలిపి మొత్తం 11 గ్రామాలకు చెందిన ఉత్సవ విగ్రహాలను భక్తులు నెరణికిలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆలయంలో అభిషేకాలు, మహామంగళ హారతి, కుంభోత్సవాలు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా 16 జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేడుకల్లో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని, నూతన జంటలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



పట్టద దేవుళ్లు







ఉత్సవాలకు హాజరైన భక్తులు,సామూహిక వివాహాలు జరుగుతున్న దృశ్యం,నూతన జంటలతో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి